సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



అమ్మవార్లకు వెండి కిరీటాలు

పి.గన్నవరం: పోతవరం గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు డాక్టర్ నెక్కంటి సుధాకరరావు, లక్ష్మీ సరోజిని దంపతులు శనివారం రూ.90 వేల వెండి కిరీటాలు సమర్పించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 4,77,227 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది.

వాడపల్లి క్షేత్రం.. భక్తజనసంద్రం



వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తజనసంద్రంగా మారింది. స్వామివారిని సుమారు 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.

8లో

న్యూస్‌రీల్

అయినవిల్లి దేవస్థానం చైర్మన్‌గా నాగబాబు



తొలి సమావేశంలో పాల్గొన్న అయినవిల్లి దేవస్థానం పాలకవర్గ సభ్యులు

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. చైర్మన్‌గా గుత్తుల నాగేశ్వర రావు (నాగబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా పులగుర్త మంగాదేవి (మడుపల్లి), గోడి హేమలత (అయినవిల్లిలంక), దామిశెట్టి వెంకటేశ్వరరావు (వీరవల్లిపాలెం), వేటుకూరి రామచంద్రరాజు (మాగాం), కర్రి మంగాదేవి (చింతనలంక), కంపసత్తి దుర్గమ్మ (తొత్తరమూడి), శీలం వెంకట రమణ (కొండుకుదురు), దిగమర్తి మంగతాయరు (అయినవిల్లి), ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. వీరికి ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. వినాయక చవితి ఉత్సవాలపై పాలకవర్గ సభ్యులు చర్చించారు.

రద్దీగా బాలబాలాజీ సన్నిధి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. స్వామి వారికి లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.21 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళాలుగా రూ.40,423 చొప్పున వచ్చాయి. స్వామి వారిని 3,069 మంది భక్తులు దర్శించుకున్నారు. 2,285 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి, ట్రస్టు బోర్డు సభ్యులు పర్యవేక్షించారు.



అశేష జనవాహినికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం



సభా వేదికపై సీఎం జగన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తదితరులు

నిడదవోలు.. జనహోరు

- సీఎం జగన్‌పై అడుగడుగునా వెల్లువెత్తిన అభిమానం
- వైఎస్సార్ కాపు నేస్తం సభకు పోటెత్తిన ప్రజానీకం
- సభ ప్రారంభం నుంచి ముగింపు వరకూ మిన్నంటిన 'సీఎం' నినాదాలు
- ఘన స్వాగతం పలికిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజలు

సాక్షి, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో అశేష ప్రజానీకం నీరాజనం పట్టారు. వెల్లువలా తరలివచ్చి.. 'జై జగన్.. జై సీఎం' అంటూ ముక్తకంఠంతో నినదించారు. అడుగడుగునా అభిమానం చూపుతూ అక్కున చేర్చుకున్నారు. హెలిపాడ్ నుంచి సభా ప్రాంగణం వరకూ సీఎం జగన్‌పై పూలవర్షం కురిపించారు. నిడదవోలు సెయింట్ ఆంబ్రోస్ పాఠశాల ప్రాంగణంలో శనివారం జరిగిన సభలో.. రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్ కాపు నేస్తం పథకం నిధుల విడుదలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి సామాజికవర్గాల్లో అర్హులైన అక్కచెల్లెమ్మలకు ఖాతాల్లోకి నగదు నేరుగా బదిలీ చేశారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో ఆయన నేరుగా నిడదవోలు సమీపంలోని సుబ్బరాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి బస్సులో 11.07 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకున్నారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. అనంతరం జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆద్యంతం ఉత్సాహంగా ప్రసంగం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం ఉదయం 11.43కు ప్రారంభమై 12.20 గంటల వరకూ సాగింది. సీఎం ప్రసంగిస్తున్నంతసేపూ ఈలలు, చప్పట్లతో ప్రజలు, అభిమానులు మద్దతు పలికారు. ప్రజల ఉత్సాహం చూసి సీఎం సైతం చిరునవ్వుతో అభివాదం చేశారు. వివక్షకు తావు లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పగానే మహిళలు ఒక్కసారిగా పైకి లేచి ఈలలు వేశారు. ఏ ప్రభుత్వంలోనూ ఇవ్వనన్ని ఉద్యోగాలు ఇచ్చామని, ప్రతి ప్రభుత్వ శాఖలో జగనన్న ఉద్యోగులు ఉన్నారని చెప్పగానే.. ఒక్కసారిగా 'జై జగన్' అంటూ నినదించారు. యువత, ఉద్యోగులను చంద్రబాబు మోసం చేశారని, వెన్నుపోటు పొడిచే ఆయనతో జాగ్రత్తగా ఉండాలని సీఎం జగన్ సూచించారు. చంద్రబాబు రూ.కోట్లు దోచుకుంటూంటే, ఆయనకు మద్దతు పలికే దొంగల ముఠా బాబును ఎలా కాపాడాలా అని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'రూ.కోట్లు దోచేస్తూంటే అరెస్టు చేయకూడదంట.. చట్టం ఎవరికైనా ఒక్కటే కదా?' అని ప్రశ్నించగానే.. 'అవును.. అవును' అంటూ ప్రజలు పెద్దపెట్టున సీఎంకు మద్దతు పలికారు. ఇన్నాళ్లూ ప్రశ్నించే వారు లేక చంద్రబాబు ఆటలు సాగాయని.. ఇప్పుడు పాపం పండిందని సీఎం చెప్పారు. అవినీతిపై ప్రశ్నిస్తానన్న దత్తపుత్రుడు వాటాలు తీసుకుని, ప్రశ్నించకుండా జైలుకు వెళ్లి, ములాఖత్ పేరుతో మిలాఖత్ అయ్యాడని సీఎం అనగానే.. జనం ఒక్కసారిగా పైకి లేచి 'దొంగ.. ప్యాకేజీ స్టార్' అంటూ నినదించారు. ఇలా సీఎం ప్రసంగం మొత్తం ఫుల్ జోష్‌తో సాగింది.



సభాప్రాంగణం లోపల.. బయట.. ఎటు చూసినా జనమే..

అడుగడుగునా ఆత్మీయత

నిడదవోలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం ప్రజలు ఉదయం నుంచే ఎదురు చూశారు. హెలిపాడ్ నుంచి సభా ప్రాంగణానికి వెళ్లే దారి పొడవునా ఆయనకు బ్రహ్మరథం పట్టారు. 'జై జగన్, పొలిటికల్ సూపర్‌స్టార్ జగనన్న' అంటూ నినాదాలు చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో చిన్నారులతో కళా ప్రదర్శనలు నిర్వహించారు. సీఎం జగన్ రాకతో నిడదవోలు గణేష్ చౌక్, గణపతి సెంటర్, బస్టాండ్, రైల్వే స్టేషన్, సింగవరం వెళ్లే రోడ్లలో ఎటూ చూసిన జనసందోహమే దర్శనమిచ్చింది. సభా వేదికపై సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ సత్కారం లభించింది. కాపు నేస్తం లబ్ధిదారులు, కాకినాడ ఎంపీ వంగా గీత, ఇతర ప్రజాప్రతినిధులు శాలువా కప్పి, సన్మానించారు. కాపు నేస్తం డెమో చెక్కు పంపిణీ అనంతరం చేతిలో చెయ్యి వేసి, మహిళలు మద్దతు తెలిపారు. సభా వేదిక వద్ద వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు సభికులను అలరించాయి.

హెలిపాడ్ వద్ద ఘన స్వాగతం

అంతకుముందు హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మార్గాని భరత్‌రామ్, వంగా గీత, కోటగిరి శ్రీధర్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జెడ్పీ చైర్మన్లు విప్పర్తి వేణుగోపాలరావు, ఘంటా పద్మావతి, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, పోతుల సునీత, బొమ్మి ఇజ్రాయిల్, కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యేలు జి.శ్రీనివాస్‌నాయుడు, కురసాల కన్నబాబు, జక్కంపూడి రాజా, సత్తి సూర్యనారాయణరెడ్డి, పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, పెండెం దొరబాబు, తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు, గ్రంధి శ్రీనివాస్, ఆళ్ల నాని, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిట్టి చేతుల్లో మెరిసిన మట్టి గణపతులు



- పర్యావరణ పరిరక్షణ దిశగా విద్యార్థుల అడుగులు
- 'సాక్షి' మీడియా గ్రూప్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యాన శిక్షణ శిబిరం
- సర్ సీవీ రామన్ స్కూలులో సందడి



సర్ సీవీ రామన్ స్కూలులో మట్టి గణపతి ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులు



మట్టి గణపతి ప్రతిమ తయారీ పోటీల విజేతలతో సర్ సీవీ రామన్, ఇతర స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులు, 'సాక్షి' సిబ్బంది

అమలాపురం టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా ఆ చిన్నారులు తమ చిట్టి చేతులతో మట్టి గణపతి ప్రతిమలు స్వయంగా తయారు చేసి పది మందికి ఆదర్శంగా నిలిచారు. వినాయక చవితి నాడు తమ ఇంట్లో మట్టి గణపతి ప్రతిమలు పెట్టుకునే పూజలు చేస్తామని ప్రతినబూనారు. 'సాక్షి' మీడియా గ్రూప్, ఏపీ పొల్యూషన్ బోర్డు కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) సంయుక్త ఆధ్వర్యాన అమలాపురం సర్ సీవీ రామన్ సహస్ర స్కూలు ప్రాంగణంలో విద్యార్థులకు 'చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి' అనే అంశంపై శనివారం శిక్షణ శిబిరం జరిగింది. దీనికి సర్ సీవీ రామన్ సహస్ర స్కూలు స్పాన్సరర్‌గా వ్యవహరించింది. శిబిరంలో వివిధ స్కూళ్లకు చెందిన ఐదేళ్ల నుంచి 16 ఏళ్లలోపు విద్యార్థులు దాదాపు 400 మంది పాల్గొని, మట్టి గణపతి ప్రతిమల తయారీలో తమ ప్రతిభను చాటారు. సీవీ రామన్ స్కూలుతో పాటు ఈదరపల్లి గౌతమీ స్కూలు, మామిడికుదురు శ్రీవిద్య స్కూలు విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొని, గణేశుని మట్టి ప్రతిమలు తయారు చేశారు.

జ్యోతి ప్రకాశనంతో..

తొలుత సర్ సీవీ రామన్ స్కూలు డైరెక్టర్లు రవణం సత్యకుమార్, రవణం చంటి, ప్రిన్సిపాల్ నిమ్మన శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, సహస్ర పిన్సిపాల్ గౌషియా తదితరులు జ్యోతి వెలిగించి, శిక్షణ శిబిరాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలంటూ అటు రాష్ట్ర ప్రభుత్వం ఇటు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించే దిశగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. స్కూలులో గణేశుని మట్టి ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిన తర్వాత తల్లిదండ్రులకు కూడా ఈ విగ్రహాల వల్ల చేకూరే పర్యావరణ ప్రయోజనాలను వివరించాలని సూచించారు. 'సాక్షి' మీడియా గ్రూపు ఎకో ఫ్రెండ్లీ గణేష్ కార్యక్రమంలో విద్యార్థులను మమేకం చేయడమే కాకుండా.. వారికి సంపూర్ణ అవగాహన, శిక్షణ ఇవ్వడం మంచి పరిణామమని కొనియాడారు.

వీరే విజేతలు

శిక్షణ శిబిరంలో భాగంగా మట్టి గణపతి ప్రతిమల తయారీపై నిర్వహించిన పోటీల్లో ఎం.విషిత (సర్ సీవీ రామన్ స్కూలు) ప్రథమ, కె.వినయ్ (శ్రీవిద్య స్కూలు, మామిడికుదురు) ద్వితీయ, జేకే శ్రీలక్ష్మి (సర్ సీవీ రామన్ స్కూలు) తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

వై.మణికంఠ (శ్రీవిద్య స్కూలు, మామిడికుదురు), పి.యోగిత, ఎం.సంతోష్ (సర్ సీవీ రామన్ స్కూలు) కన్సొలేషన్ బహుమతులు సాధించారు. విజేతలకు ఆ స్కూలు యాజమాన్య, ఉపాధ్యాయ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. స్కూలు డైరెక్టర్ సత్యకుమార్, వైస్ ప్రిన్సిపాల్ పెద్దిరాజు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో 'సాక్షి' స్టాఫ్ రిపోర్టర్ నిమ్మకాయల సతీష్‌బాబు, సాక్షి మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.







ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న ఎం.విషిత, కె.వినయ్, జేకే శ్రీలక్ష్మి

అభినందనీయం



'సాక్షి' మీడియా గ్రూపు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన మట్టి గణపతి ప్రతిమల తయారీ శిక్షణ శిబిరం వల్ల ఉభయ తారకమైన ప్రయోజనాలున్నాయి. సృజనాత్మకంగా మట్టి గణపతి ప్రతిమలు తయారు చేయడంతో పాటు పర్యావరణ హితమైన పనులు మాత్రమే చేయాలన్న సందేశం కూడా ఇందులో ఉంది. పిల్లల్లో ఈవిధమైన చైతన్యం తీసుకుని రావడం ద్వారా వారి ఇళ్లల్లో, ఊళ్లో మరికొంత మందికి వారు అవగాహన కల్పించి, చైతన్యపరిచే అవకాశం ఉంది. ఈవిధమైన ఆదర్శ భావాలు ప్రేరేపించడం అభినందనీయం.

– నిమ్మన శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, సర్ సీవీ రామన్ స్కూలు, అమలాపురం

జీవనోపాధి అవకాశాలు పెంచేందుకే కాపు నేస్తం



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న జేసీ నూపుర్ అజయ్ తదితరులు

- జిల్లాలో 36,823 మందికి మేలు
- రూ.55.23 కోట్ల మేర లబ్ధి

సాక్షి, అమలాపురం: కాపు, బలిజ, తెలగ, ఒంటరి ఉపకులాల్లోని మహిళల జీవనోపాధి అవకాశాలను, ఆర్థిక, జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం పథకం ప్రవేశపెట్టిందని జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ తెలిపారు. వరుసగా నాలుగో ఏడాది కూడా ఈ పథకం నిధులను నిడదవోలు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి జేసీ నూపుర్ అజయ్‌తో పాటు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కూడా పాల్గొన్నారు. జిల్లాకు సంబంధించిన నమూనా చెక్కును లబ్ధిదారులకు అందించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ, కాపు మహిళలు చిన్నచిన్న వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ సొమ్ములు అక్కరకు వస్తాయని అన్నారు. వారు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేయకూడదనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక చేయూత అందిస్తోందని చెప్పారు. వైఎస్సార్ ఆసరా, డ్వాక్రా, సున్నా వడ్డీ రుణాలతో పాటు కాపు నేస్తం మరింత మేలు చేకూరుస్తుందని అన్నారు. కాపు నేస్తం పథకం కింద అర్హులైన మహిళల ఖాతాల్లో ఏడాదికి రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.75 వేల ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 36,823 లబ్ధిదారులకు రూ.55.23 కోట్ల మేర నాలుగో విడతలో లబ్ధి చేకూరిందని చెప్పారు. ఈ పథకం కింద ఇప్పటి వరకూ నాలుగు విడతలుగా జిల్లాలో రూ.207.92 కోట్ల మేర లబ్ధి పొందారని తెలిపారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకూ మేలు చేస్తోందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జగనన్నకు పలుకుదాం.. ఘన స్వాగతం: సీఎం జగన్ రోడ్ షోలో మహిళా కెరటం


ఈ అపురూప ఘట్టాన్ని ఫోనులో బంధిద్దాం: సీఎం జగన్‌కు ఫొటోలు తీస్తున్న యువతి


మామయ్య దగ్గరకు వెళ్దాం పదండి: బిడ్డల్ని తీసుకుని సభకు వెళ్తున్న మహిళ


ప్రియనేత ప్రసంగం వినాలని..: సభకు వస్తున్న దివ్యాంగుడు


ఉత్సాహతరంగమై..: జై.. జగన్ అంటూ నినదిస్తున్న యువత


వడివడిగా: సీఎం సభకు తరలుతున్న మహిళా వాహిని

ప్రభంజనం


జనప్రవాహం: నిడదవోలు వీధుల్లో నుంచి సీఎం సభకు తరలుతున్న ప్రజానీకం

జన సంక్షేమ సారథి.. ఆంధ్రప్రదేశ్ ప్రగతి వారధి.. జనహృదయ విజేత.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అడుగు మోపిన వేళ.. నిడదవోలు పట్టణం జన ప్రభంజనాన్ని తలపించింది. తమ ప్రియ నేతను కళ్లారా చూసేందుకు.. ఆయన మాటలను చెవులారా విని, నవచైతన్యాన్ని పొందేందుకు.. జనం వెల్లువొచ్చిన గోదారిలా తరలివచ్చారు. హెలిపాడ్ నుంచి సీఎం వచ్చే మార్గం.. పట్టణంలోని రోడ్లు.. సభా ప్రాంగణం లోపల.. బయట.. ఇలా ఎటు చూసినా జనసందోహమే. దారి పొడుగునా తమ అభిమాన నేతపై పూలజల్లులు కురిపించారు. ఆయన ప్రసంగాన్ని ఆద్యంతం శ్రద్ధగా విన్నారు. తమను చేయిపట్టి ప్రగతి దారుల్లో నడిపించే నేత ఆయనేనని త్రికరణశుద్ధిగా నమ్ముతూ.. 'జై జగన్' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు.

\- నిడదవోలు


ఆనందమానందమాయె: తమకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌ను చూసి చేతులు ఊపుతున్న జనం


చల్లగా ఉండు తండ్రీ: వృద్ధురాలి ఉద్వేగం


సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కళ్లారా చూసిన వేళ అక్కచెల్లెమ్మల ఆనందం


జగనన్నకు చెబుదాం: సమస్యలు చెప్పుకొనే వారి కోసం సభాప్రాంగణంలోనే స్పందన కౌంటర్


సీఎం ప్రసంగాన్ని శ్రద్ధతో, ఆనందంతో వింటున్న యువతులు


జై జగన్: మార్మోగిన జగన్నినాదం


మహిళోత్సాహం: సీఎంను చూసిన వేళ ఆనందం

నాఫెడ్ కేంద్రాలు నిరంతరం కొనసాగించేందుకు చర్యలు

అంబాజీపేట, కొబ్బరి రైతులను ఆదుకునేందుకు ఏడాది పొడవునా నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాలను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు, నాఫెడ్ బ్రాంచి మేనేజర్ టి.నాగేశ్వరశర్మ ఆధ్వర్యాన అంబాజీపేట మార్కెట్ యార్డ్‌లో నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ, ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఆరు నెలల పాటు కొనసాగుతాయని, వీటిని నిరంతరం కొనసాగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చిస్తామని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టుగానే కొబ్బరి కూడా కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతుల వద్దకు అధికారులే నేరుగా వచ్చి కొబ్బరిని పరిశీలించి కొనుగోలు చేస్తారని చెప్పారు. నాఫెడ్ కేంద్రంలో కొబ్బరి విక్రయించే రైతులు తమ వివరాలను ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. నాఫెడ్ కేంద్రాల్లో మిల్లింగ్ కోప్రాను క్వింటాల్‌కు రూ.10,860, బాల్ కోప్రాను క్వింటాల్‌కు రూ.11,750కి కొనుగోలు చేస్తారని తెలిపారు.

దుమ్ము, ధూళి, పెంకులు ఒక శాతం కంటే ఎక్కువ ఉండకూడదని, ముడతలు ఏర్పడిన, పగిలిన, నలుపు, బూజు కొబ్బరి చిప్పలు 10 శాతం కంటే ఎక్కువ ఉండకూడదని చెప్పారు. తేమ 6 శాతం దాటకుండా రైతులు చూసుకోవాలని ఎంపీ ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎస్.విశాలాక్షి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు

వాడపల్లి క్షేత్రం.. భక్తజనసంద్రం

అత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తజనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 35 వేల మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారిని కొబ్బరి మొవ్వ ఆకులు, వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ సేవలు, పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, విరాళాల ద్వారా స్వామివారికి రూ.30,57,723 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.


ఆలయంలో భక్తుల కోలాహలం

బాలబాలాజీ సన్నిధి.. భక్తుల రద్దీ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.1.61 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.21 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళాలుగా రూ.40,423 చొప్పున వచ్చాయి. స్వామి వారిని 3,069 మంది భక్తులు దర్శించుకున్నారు. 2,285 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి, ట్రస్టు బోర్డు సభ్యులు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి